## క్లుప్తంగా

### ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఉసేన్‌స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

**కోవెలకుంట్ల:** మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. గ్యార్మీ నెల నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు వైఎస్సార్, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో దర్గా భక్తులతో కిటకిటలాడింది. ఉసేన్‌స్వామికి జెండాలు, పూలదట్టీలు, ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### శిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు

**బేతంచెర్ల:** స్థానిక కర్నూలు రహదారిలో వెలసిన శిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం బాబాకు అభిషేకం, కుంకు మార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు కృపాధామ్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

**పుట్టపెద్దమ్మకు ప్రత్యేక పూజలు**

స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

### బాలికల విద్యాభివృద్ధికి సహకరించాలి

**బనగానపల్లె రూరల్ :** బాలికల విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పిలుపునిచ్చారు. మండలంలోని చెరువుపల్లె ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు ఆయన నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం స్కూల్ హెచ్ఎం నౌషద్ బేగం అధ్యక్షన నిర్వహించిన సమావేశంలో ఆయన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.

### ఉత్తమ ఫుట్‌బాల్ కోచ్ అవార్డు ప్రదానం

**బేతంచెర్ల:** పట్టణానికి చెందిన జాతీయ క్రీడాకారుడు సుదర్శన్ రెడ్డి ఉత్తమ ఫుట్ బాల్ కోచ్ అవార్డు అందుకున్నారు. ఒకెరీడ్జ్ ఇంటర్నేషల్ స్కూల్, హైదరబాద్‌లో ఫుట్‌బాల్ కోచ్‌గా పని చేస్తున్న సుదర్శన్ రెడ్డికి గచ్చిబౌలీ స్టేడియంలో స్పోర్ట్ ఫర్ ఆల్ ముంబై స్పోర్ట్ కంపెనీ ప్రతినిధులు అవార్డు అందజేశారు. 60 పాఠశాలల పరిధిలోని కోచ్‌ల ప్రతిభను పరిశీలించి ఒక్కరికీ మాత్రమే ఈ అవార్డును ప్రదానం చేస్తారు. అవార్డు అందుకున్న సుదర్శన్‌రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

### ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ తగదు

**ప్యాపిలి:** విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణాత్ యాదవ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర వైఖరిని నిరసిస్తూ ఈ నెల 8 వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివకేశవులు, నాయకులు చంద్రశేఖర్ నాయక్, బంగారప్ప, దుర్గా తిమ్మారెడ్డి, కేశవులు, మధు, లక్ష్మీనారాయణ, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

### సీస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



హెచ్‌ఎం బాలసుబ్బారెడ్డికి ప్రశ్నాపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ

**కొలిమిగుండ్ల:** మండల కేంద్రం కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న సీస్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ అబ్దుల్‌కలాం చెప్పారు. గురువారం పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను హెచ్‌ఎం బాలసుబ్బారెడ్డికి ఆయన అందజేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతు శుక్రవారం ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు ఉన్నత పాఠశాలలో సీస్ పరీక్ష జరుగుతుందన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల నుంచి 3, 6, 9వ తరగతి విద్యార్థులతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వారం రోజుల పాటు ప్రాక్టీస్ చేయించారన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సీస్ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. మండలంలో ఎంపిక చేసిన 25 పాఠశాలల నుంచి 1275 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని ఆయన చెప్పారు.

# సమస్యలు పరిష్కరించేందుకే... మీ ముందుకు

- ప్రజల వద్దకే పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం
- ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు
- అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి







సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చల్లా కుటుంబ సభ్యులు, సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**అవుకు:** ప్రజల వద్దకే పాలన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా మారుమూల గ్రామాలకు సైతం నేరుగా ప్రభుత్వ సేవలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ప్రజలను నేరుగా కలిసి సమస్యలు తెలుసుకుని పరిష్కరేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మీ ముందుకు వచ్చామని, ఇంతవరకు ఇలాంటి కార్యక్రమం ఏ ముఖ్యమంత్రి చేపట్టలేదన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కార చర్యలు చేపడుతామని కాటసాని హామీ ఇచ్చారు. మండల కేంద్రం అవుకు-2 గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, కాటసాని ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, చల్లా రఘునాథ్ రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి, చల్లా విక్రాంత్ రెడ్డి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆయా కాలనీలలో విస్తృతంగా పర్యటించారు. ప్రజలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. అవ్వా ఈ నెల పింఛన్ అందిందా.. వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి డబ్బులు ఇచ్చారా... పింఛన్ పంపిణీలో ఏదైనా సమస్యలు ఉన్నాయా.. అంటూ ఎమ్మెల్యే ఆరా తీశారు. అదేవిధంగా మహిళలతో మాట్లాడిన కాటసాని... అక్కా సంక్షేమ పథకాలు అందుతున్నాయా... వైఎస్సార్ చేయూత వస్తుందా.. ఆసరా అందిందా... మీ పిల్లలకు అమ్మ ఒడి పడుతుందా.. అని అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఇళ్ల స్థలాలు లేవని, గృహం మంజూరు కాలేదని కొందరు ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో పేర్లు నమోదు చేయించారు. తమ ఇళ్లపై కరెంట్ తీగెలు వెళ్లాయని, భయాందోళనకు గురువుతున్నామని ఈబీసీ కాలనీలో బోయ నాగార్జున, కంబగిరిరాముడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గతంలో కరెంట్ తీగె తగిలి గాయపడ్డానని కంబగిరిరాముడు ఆందోళన వ్యక్తం చేయగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఏఈ పక్కీరయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటరమణ, కరిముల్లా, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అశ్విన్, సర్పంచ్ మందా గుర్రమ్మ, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, అవుకు పట్టణ బలిజ సంఘం అధ్యక్షుడు కునుకుంట్ల రమణ, నాయకులు వాయునంద గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్, బత్తిన మద్దిలేటి గౌడ్, కాంట్రాక్టర్లు మద్దయ్య, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.40లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే**

మండల కేంద్రం అవుకు సెంటర్ నుంచి మార్కెట్ రోడ్డు వరకు రూ.40లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే చెప్పారు. అవుకు మండలంలో దశాబ్దాల తరబడి రోడ్లకు నోచుకొని గ్రామాలకు సైతం బీటీ రోడ్లను నిర్మించామని గుర్తు చేశారు. కోనాపురం, రామవరం, నిచ్చెనమెట్ల, అన్నవరం, గడ్డమేకుల పల్లె, ఓబుళాపురం తదితర గ్రామాల ప్రజలు నేడు సాఫీగా ప్రయాణాలు చేస్తున్నారన్నారు. ప్రాధాన్యత మేరకు గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు.

### నేడు యనకండ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

**బనగానపల్లె రూరల్ :** మండలంలోని యనకండ్ల గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య గురువారం తెలిపారు. డాక్టర్లు ఫిరోజ్, సోహెల్‌బాబు తదితరులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందలను పంపిణీ చేస్తారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో బాలాలయ ప్రతిష్ఠ



ఆలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు

**బనగానపల్లె :** మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం బాలాలయ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈఓ రామానుజన్, వేదపండితులు అనుజ్ఞ, గణపతి పూజ, యాగసంకల్పం, మహాశాంతి, ప్రాయిచిత్త హోమం, దేవిమూలమన్ర పంచసూక్తి హోమం, పూర్ణహుతి కళాపకర్షం అనంతరం బాలాలయప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పీఆర్ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఓటర్లే ఎక్కువ

**డోన్ టౌన్ :** డోన్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నట్లు ఆర్డీఓ వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బూత్ లెవల్ అధికారులు, సూపర్ వైజర్లు ఇంటింటికీ తిరిగి సేకరించిన వివరాల మేరకు మొత్తం 224085 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మహిళలు 1,13,259 మంది ఓటర్లు, పురుషులు 1,10,748, ఇతరులు78మంది ఓటర్లు ఉన్నారన్నారు. డోన్ రూరల్ 50,319 మంది ఓటర్లు, అర్బన్ 50,155, బేతంచెర్ల రూరల్ పరిధిలో 39,665అర్బన్‌లో 28,042 మంది ఓటర్లు, ప్యాపిలి మండలంలో 55904 మంది ఓటర్లు ఉన్నారన్నారు. డోన్, బేతంచెర్ల అర్బన్, రూరల్‌లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు డిసెంబరు 9వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్ల జాబితాతో బూత్ లెవల్ అధికారులు ,సూపర్ వైజర్లు వారికి కేటాయించిన బూత్‌ల వద్ద ఈ నెల 4,5లు,డిసెంబరు 2,3 తేది శని, ఆదివారాల్లో ఉదయం 10గంటల నుంచి సాయిత్రం 5గంటల వరకు ఉండి ఓటర్ల జాబితాపై ప్రజలు అడిగే సమాచారం ఇస్తారన్నారు. అలాగే అవసరమైన ఫారం 6,7,8 లను స్వీకరించాలని ఆయన బూత్ లెవల్ అధికారులకు సూచించారు. ఇలా రెండు దఫాలుగా ఓటర్ల జాబితాపై వివరించి 2024 జనవరి 5వ తేదీ శుక్రవారం ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విడుదల చేస్తామని ఆర్డీఓ వివరించారు.

## ఎస్ఈఏఎస్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్

**ప్యాపిలి:** మండలంలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించనున్న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్) పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంఈఓ వెంకటేశ్ నాయక్ సూచించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం పరీక్షా విధానంపై హెచ్‌ఎంలకు, ఇన్విజిలేటర్‌లకు అవగాహన కల్పించారు. మండలంలోని 39 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 3, 6,9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు

**కోవెలకుంట్ల:** జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తామని సర్పంచ్ ఈర్నపాటి నాగేంద్ర తెలిపారు. మండలంలోని జోళదరాశి గ్రామంలో రూ. 50 లక్షలతో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు విడుదలయ్యాయన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు రాంశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతం రాంమోహన్‌రెడ్డి, ఈర్నపాటి సుబ్బరాయుడు, గుద్దేటి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామసుబ్బరాయుడు, మధుకిరణ్, చెన్న కృష్ణారెడ్డి, రాజేశ్వరరెడ్డి, పెద్ద సుబ్బరాయుడు, చిన్న సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ నాగేంద్ర

## కృష్ణానదిపై బ్రిడ్జితోపాటు బ్యారేజీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కామని వేణుగోపాల్‌రెడ్డి

**కోవెలకుంట్ల:** 167 జాతీయ రహదారిలో కృష్ణా నదిపై నిర్మించ తలపెట్టిన తీగల వంతెన టెండర్లు రద్దు చేసి బ్రిడ్జికం బ్యారేజీ ఏర్పాటు చేయాలని రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి పోతిరెడ్డిపాడు ద్వారా సుమారు 120 కిమీ ఉన్న శ్రీశైలం జలాశయం నుంచి నీరు అందాల్సి ఉందన్నారు. రిజర్వాయర్‌లో 854 అడుగుల నీటిమట్టం ఉంటేనే పోతిరెడ్డిపాడుకు సాగునీరు విడుదలవుతుందన్నారు. రూ. 1,400 కోట్లతో కృష్ణానదిపై తీగల వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ వంతెన నిర్మాణం పర్యాటకులు పర్యటించడానికి మాత్రమే పనికి వస్తుందన్నారు. రూ. వెయ్యి కోట్లతో వంతెనతో కూడిన బ్యారేజీ ఏర్పాటు చేయడం వలన రాయలసీమకు పుష్కలంగా సాగునీరు అందుతుందన్నారు. కేంద్రం మరోసారి పునరాలోచించాలని కోరారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

**డోన్:** పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని, వారి ఆరోగ్య సంరక్షణకు ఏడు పార్కులను ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పార్కు, వాకింగ్ ట్రాక్‌ల కమిషనర్ వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో కొన్ని పార్కులలో యోగా, జిమ్ సెంటర్లు, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటుకు నిధులు కేటాయించారన్నారు. అదేవిధంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇండోర్ స్టేడియం, స్నూకర్, టేబుల్ టెన్నిస్, షటిల్, టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు మిట్టా ఉమామహేశ్వరి, మేకల విమల, కాశింబి, మౌళాబీ, కళావతి, బుర్రు అరుణ, సుకన్య, ఇంథియాజ్, వెంకటేశ్వరమ్మ, బోయ సుమలత, రైల్వే నాగేంద్ర, మహేశ్వరరెడ్డి, ఆర్ట్ రమణ, ధారా హరి, సుంకన్న, వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాలేషా, బుర్రు శ్రీధర్, కోఆప్షన్ మెంబర్ పాతపేట రఫీ తదితరులు పాల్గొన్నారు.



వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ రాజేష్

### అన్ని మండల కేంద్రాల్లో హిందూ సమ్మేళనం

**బనగానపల్లె :** సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో హిందూ సమ్మేళనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మాధవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. ఈ నెల 11న స్థానిక బీవీ సుబ్బారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో హిందూ సమ్మేళణం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ కన్వీనర్ శివరామిరెడ్డి, జిల్లా ధర్మప్రచారక్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ శంకరయ్య, సహ కన్వీనర్లు నాగమల్లారెడ్డి, బాల వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి జంబయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

# ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న ఓ మహిళతో వైద్య సేవలపై ఆరా తీస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

**కొలిమిగుండ్ల:** ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన వైద్యం అందజేస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కనకాద్రిపల్లెలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రత్యేకించి వృద్ధులతో మాట్లాడిని జెడ్పీ చైర్మన్... అవ్వా... తాతా ఎలా ఉన్నాయి వైద్య పరీక్షలు అని అడిగారు. చాలా బాగున్నాయని వృద్ధులు సమాధానమిచ్చారు. వైద్య శిబిరాలు ఎవరు పెట్టారని జెడ్పీ చైర్మన్ అడగ్గా ... ఇంకెవరు మా జగన్ బాబు అంటూ సంతోషం వ్యక్తం చేశారు అవ్వతాతలు. అనంతరం పాపిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్లు వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ శివశంకర్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు టీసీ వెంకట్రాముడు, పెద్ద అంకిరెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల- నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయలయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు.. రుద్రవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన మహబూబ్ వలీ, ములాన్‌బీ దంపతులు కోవెలకుంట్ల మండలం రేవనూరు ఉసేన్‌స్వామి దర్గాను దర్శించుకుని బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కలుగొట్ల సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తాపడి వారు గాయపడగా స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న సర్పంచ్ కళ్యాణి

**డోన్:** మండలంలోని కన్నపుకుంట గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 45 వేల చెక్కును గురువారం సర్పంచ్ కళ్యాణి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పురుషోత్తం, రామ్మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, గంగారాం, మద్దయ్య, చిన్న గంగులు, రామక్క, సంజీవుడు తదితరులు పాల్గొన్నారు.

### మట్కా బీటర్లకు రిమాండ్

**డోన్ టౌన్ :** పట్టణానికి చెందిన ఐదుగురు మట్కా బీటర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. పాతపేటకు చెందిన దూదేకుల వహీద్ అహ్మద్‌ను పాతమున్సిపల్ కార్యాలయం వద్ద మట్కా రాస్తుండగా అదుపులోకి తీసుకుని రూ.52,600, 15లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. షేక్ పర్వీనాబేగంను రాములదేవాలయం సమీపంలో అదుపులోకి తీసుకొని రూ.4,500, 5లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. కోట్లవారిపల్లెకి చెందిన రమణ, భానుప్రసాద్, కొండపేటకు చెందిన వడ్డే వెంకటేశ్వర్లును చాకిరేవు మిట్ట వద్ద మట్కా రాస్తుంగా అదుపులోకి తీసుకుని రూ.15,500, 15లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

### అథ్లెటిక్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

**కొలిమిగుండ్ల:** తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన ఆదిత్య బిర్లా పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అథ్లెటిక్ మీట్‌లో ప్రతిభ చూపారని హెచ్‌ఎం భాస్కరభట్ల కృష్ణమోహన్ చెప్పారు. కంపెనీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ కెయస్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి గురువారం విజయోత్సవ సభ నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతు సీబీఎస్ఈ క్లస్టర్ పరిధిలో గత నెలలో బాలుర విభాగంలో కృష్ణపట్నం, బాలిక విభాగంలో విజయవాడలో అథ్లెటిక్ పోటీలు జరిగాయన్నారు. పాఠశాల విద్యార్థులు సత్తాచాటి 12 స్వర్ణాలు, రజతంతో పాటు 8కాంస్యలతో కలిపి మొత్తం 21 పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. ఏడు మంది విద్యార్థులు 5నుంచి ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. 23 మంది విద్యార్థులను ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మైన్స్ ముకుల్ పట్వర్థన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వైద్యరంగానికి పెద్దపీట

**బనగానపల్లె:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలుకూరులో ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని గుండం శేషిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటింటికి వైద్య సౌకర్యం కలిస్తున్న సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు మహమ్మద్, ప్రసూతి నిపుణులు కళ్యాణి, వైద్యుల సోహెల్‌బాబు, కావ్య తదితర వైద్య సిబ్బంది 920 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ గురుప్రసాద్, ఈఓ శ్రీనివాసులు, ఎంపీహెచ్ఈఓ సుబ్బరాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కాతా వెంకటసుబ్బారెడ్డి, రాఘవయ్య, కాటసాని పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గుండం శేషిరెడ్డి

### వరి సాగులో మెలకువలు పాటించాలి

**బనగానపల్లె రూరల్ :** వరి సాగులో రైతులు మెలకువలు పాటించాలని, ఎలుకల నుంచి పంటలను కాపాడుకునేందుకు తగిన నివారణ చర్యలు తీసుకోవాలని నంద్యాల ఏడీఏ రాజశేఖర్ సూచించారు. మండలంలోని కైప గ్రామంలో గురువారం వరి సాగులో సామూహిక ఎలుకల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ వరి పంటలో ఎక్కువగా ఎలుకలు చేరి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎలుకల మందును ఏ విధంగా తయారు చేసుకోవాలి, ఎలా నివారించు కోవాలి తదితర విషయాలపై రైతుభరోసా సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ రాజశేఖర్

**ఫర్టిలైజర్ షాపు తనిఖీ**

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వెంకటగిడ్డాంజనేయ ఫర్టిలైజర్ షాపును గురువారం ఏడీఏ తనిఖీ చేశారు. ఈ పాస్ మిషన్‌తోపాటు షాపులో ఉన్న స్టాక్ వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ సుబ్బారెడ్డి, షాపు యజమాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగిన పింఛన్ల పంపిణీ

**కోవెలకుంట్ల/బనగానపల్లె రూరల్ :** సామాజిక పింఛన్ పంపిణీ రెండవరోజు గురువారం కొనసాగింది. మండల కేంద్రం కోవెలకుంట్లతోపాటు గ్రామాల్లో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి 5,474మందికి అందజేసి గురువారం నాటికి 91శాతం సాధించినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా పేర్కొన్నారు. మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. పట్టణంలోని సచివాలయం -3 పరిధిలో నివాసం ఉంటే లబ్ధిదారుడు జాఫర్‌హుస్సేన్ జిల్లా కేంద్రం నంద్యాలల్లోని ఇండస్ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా వార్డు వలంటీర్ ఆశాబీ అక్కడికి వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుక రూ.2,750 అందజేశారు.



నంద్యాలలోని ఇండస్ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్న జాఫర్‌హుస్సేన్‌కు బయోమెట్రిక్ ద్వారా పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ ఆశాబీ

# భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ



సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ రమేష్



సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ రమేష్

**కోవెలకుంట్ల/బనగానపల్లె రూరల్ :** బనగానపల్లె నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులు గురువారం సమాధుల(ఆత్మల) పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మృతి చెందిన వ్యక్తుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ క్రైస్తవులు శ్మశానవాటికలకు చేరుకుని సమాధులను అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. బనగానపల్లె మదర్‌థెరిస్సా చర్చి ఫాదర్ రమేష్ ఆరాధనలు చేశారు.

### పాత మున్సిపల్ భవనాన్ని హాస్టల్‌కు కేటాయించాలి

**డోన్ టౌన్ :** పాత మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ఇంటర్,డిగ్రీ చదివే బాయిస్ హాస్టల్‌కు అనుమతి ఇవ్వాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా నాయకులు తెలుగు విజయ్‌కుమార్, నాయకులు అజయ్ కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ విద్యా సాగర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం అద్దె హాస్టల్ భవనాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్‌కు ఆయన తెలిపారు.